క్లుప్తంగా

ఆర్‌ఆర్‌పేట పాల సంఘం ఎన్నిక ఏకగ్రీవం

చోడవరం: రాయపురాజుపేట పాల సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధికార పార్టీకి చెందిన బొడ్డేడ రాజబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖ డెయిరీకి చెందిన పాల ఉత్పత్తిదారుల సంఘం ప్రస్తుత పాలకవర్గం పదవీ కాలం పూర్తికావడంతో ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. అధికార మద్దతుదారు రాజబాబు ప్యానల్ ఏకగ్రీవంగా ఎన్నికైంది. కొత్త పాలకవర్గాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్, సర్పంచ్ బొడ్డేడ రాము నాయుడు అభినందించారు.

ఘనంగా మోదకొండమ్మ పండగ


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల: మండలంలోని సత్యవరంలో గ్రామ ఆరాధ్య దేవత మోదకొండమ్మ పండగ ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నేల వేషాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామానికి చెందిన మహిళలు అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలతో కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వృద్ధులకు నిత్యావసర సరకుల వితరణ


ఆశ్రమ నిర్వాహకుడికి నిత్యావసర సరకులు అందజేస్తున్న దాత గణేష్, కుటుంబ సభ్యులు

రోలుగుంట: కొవ్వూరులోని వెంకటేశ్వర వృద్ధాశ్రమంలో 30 మంది వృద్ధులకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను మాకవరపాలెం గ్రామానికి చెందిన దుర్గా గణేష్ వితరణగా అందజేశారు. రూ.20 వేలతో సమకూర్చిన వీటిని నిర్వాహకుడు యర్రంశెట్టి రాజారావుకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ తన తండ్రి స్వర్గీయ వెంకటరమణ సంస్మరణార్థం ఇక్కడ అన్నదానం కోసం నిత్యావసర సరుకులు ఇచ్చామన్నారు. వృద్ధుల కోసం ఎంతో ఓర్పుతో సంస్థ నిర్వహిస్తున్న నిర్వాహకుడిని అభినందించారు. దాత గణేష్‌కు వృద్ధులు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

మాడుగుల: మండలంలో సోమవారం నుంచి సామాజిక పింఛన్లు సచివాలయం సిబ్బందితో పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో కాశీ ప్రసాద్ తెలిపారు. మండలంలో 212 మంది సచివాలయ ఉద్యోగులతోపాటు ఇతర సిబ్బందితో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందిస్తామన్నారు. 11,918 మందికి 8 కోట్ల 10 లక్షల 68 వేల 500 రూపాయలు మంజూరైందన్నారు.

దివ్యాంగులకు ఆదర్శం హెలెన్ కెల్లర్


హెలెన్ కెల్లర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కొరుప్రోలు వెంకటేశ్వరరావు

అనకాపల్లి: అతి చిన్న వయస్సులో వినికిడి, దృష్టిని కోల్పోయి, మాట్లాడలేని స్థితి నుంచి ప్రపంచానికి మార్గదర్శకంగా మారిన హెలెన్ కెల్లర్ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని విజువల్లీ చాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొరుప్రోలు వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో హెలెన్ కెల్లర్ 144వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేద దివ్యాంగులకు వస్త్రాలను పంపిణీ చేశారు. హోమ్ ఫ్రమ్ పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి పురుషోత్తం పాల్గొన్నారు.

వరి ఆకుపోతలు ప్రారంభం


లూలూరు పొలాల్లో వరి విత్తనాలు జల్లుతున్న రైతులు


ట్రాక్టరుతో ఆకుమడి దున్నుతున్న రైతు

- నారుమడులు సిద్ధం చేసుకుంటున్న రైతులు

బుచ్చెయ్యపేట: ఖరీఫ్ వరి ఆకుపోతలు ప్రారంభమయ్యాయి. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఆదివారం వరి ఆకు పోతలు వేశారు. పది రోజులుగా వర్షాలు నమ్మిగా కురుస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులైంది. ఎండలు, ఉక్కపోత తగ్గి వాతావరణం చల్లబడింది. పలు గ్రామాల్లో నదులు పొంగి ప్రవహిస్తుండగా, వ్యవసాయ బావులు, చెరువులు నీటితో నిండుతున్నాయి. దీంతో రైతులు వరి ఆకుపోతలు వేయడం ప్రారంభించారు. లోపూడి, లూలూరు, బంగారుమెట్ట, ఎల్బీపురం, పాట్టిదొరపాలెం, కొమళ్లపూడి, గంటికొర్లాం తదితర గ్రామాల్లో రైతులు జోరుగా వరి ఆకుపోతలు వేశారు. బుచ్చెయ్యపేట మండలంలో ఏటా 6,800 ఎకరాల్లో వరి నాట్లు వేస్తారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో అన్ని గ్రామాల్లో రైతులు వరినాట్లు వేయడానికి సిద్ధమయ్యారు. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల ద్వారా తీసుకున్న స్వర్ణ, సాంబ మసూరి, సోనామసూరి, ఆర్జీఎల్, శ్రీకాకుళం సన్నాలు తదితర రకాల వరి విత్తనాలను రైతులు జోరుగా వేస్తున్నారు. సేంద్రియ ఎరువులు భూమిలో కలిపి వరి విత్తనాలు జల్లి దుక్కటెద్దులు, ట్రాక్టర్లతో ఆకుమడులు దున్ని వరి విత్తనాలు భూమిలో కలుపుతున్నారు. సొంత వరి విత్తనాలు జల్లేటప్పుడు విత్తన శుద్ధి చేసుకుని చల్లుకోవాలని మండల వ్యవసాయాధికారి భాస్కరరావు సూచించారు. ఈ మేరకు నారుమడి యాజమాన్య పద్ధతులను సూచించారు.

నారుమడి తయారీలో జాగ్రత్తలు...

వరినారు పోసు రైతులు కొన్ని జాగ్రత్తలు పాటించి నారుమళ్లను పోసుకుంటే నాణ్యమైన నారు పొందవచ్చు. దమ్ము చేసిన నేలను 10 మీటర్ల పొడవు, ఒక మీటరు వెడల్పుతో నారుమడి చేసుకోవాలి. నారుమడిలోని నీరు, పోషకాలు బయటకు పోకుండా గట్లు వేసుకోవాలి. గట్లు సమానంగా గట్టిగాను పోయాలి. మడిలో చెత్తా చెదారం లేకుండా జాగ్రత్త పడాలి. నారుమడి బురద పదును ఉండాలి. నారు మడులు ఎత్తుగా ఉండేలా జాగ్రత్త పడాలి. రెండు మడుల మధ్యలో 20 సెంటీమీటర్ల వెడల్పులో కాలువ తీయాలి. కాలువలోని మట్టిని తీసి మడిలో వేసే నారుమడిని ఎత్తుగా చేసుకోవాలి. నారుమడి మొత్తం చదునుగా ఉండాలి. నారుమడి 10 నుంచి 12 రోజుల ముందే దమ్ము చేసి చదును చేసుకోవాలి. నీరు పెట్టడానికి తీయటానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసుకోవాలి. మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు ఐదు కిలోల చొప్పున చల్లుకోవాలి. నారు పూర్తిగా పురి విచ్చుకునే వరకు ఆరు తడులు ఇచ్చి.. తర్వాత నీరు నిల్వ కట్టాలి. జింకు లోపాన్ని గమనించి 2 గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఈ జింకు లోప లక్షణాలు ఎక్కువగా కనబడతాయి. తల్లి పురుగులు గుడ్లను కొసల మీద పెడుతుంది. నారు నాటేటప్పుడు కొసలు విరిచి నాటాలి. దీనితో గుడ్లను నిర్మూలించవచ్చు.

లైబ్రేరియన్ శ్రీనివాసరావుకు ఘన సత్కారం


శ్రీనివాసరావును సత్కరిస్తున్న అధికారులు, గ్రామ పెద్దలు

దేవరాపల్లి: గ్రంథపాలకుడు ఓ.శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ సత్కార సభ ఆదివారం స్థానిక గ్రంథాలయంలో జరిగింది. ఇక్కడ 31 ఏళ్ల పాటు సుదీర్ఘంగా సేవలందించిన శ్రీనివాసరావు సేవలను ఎంఈవోలు బి.పడాల్‌దాస్, వి. ఉషారాణి గుర్తు చేసుకున్నారు. ఎంతో నిబద్ధతతో సేవలు అందించారన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, మాజీ ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, మహేశ్వరీ నాయుడు, గండిపడాల అప్పలరాజు, జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ సభ్యుడు కేవీ రమణ, కొరుపోలు శ్రీను, గంగవంశం సంతోష్ తదితర గ్రామ పెద్దలు, పాఠకులు ఘనంగా సత్కరించారు.

దేవరాపల్లి ఇన్‌చార్జి ఎంపీడీవోగా అప్పలరాజు



దేవరాపల్లి: ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఎస్. అప్పలరాజు నియమితులయ్యారు. స్థానిక ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన్ను ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్నతాధికారులు నియమించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన గతంలో ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసి పరిపాలన అధికారిగా పదోన్నతి పొంది బదలీపై వెళ్లారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పింఛన్ల పంపిణీకి పక్కాగా ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. సచివాలయ సిబ్బంది ఉదయం 6 గంటల నుంచి పింఛన్ దారుల ఇంటికి వెళ్లి నగదు పంపిణీ చేస్తారన్నారు. కొన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తానన్నారు.

విస్తారంగా కర్ర పెండలం సాగు


దాలివలసలో కర్ర పెండలం పంట

కె.కోటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో కర్ర పెండలం పంటను రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. ప్రధానంగా ఈ పంటను మెట్ట ప్రాంతాలైన గరుగుబిల్లి, గొండుపాలెం, దాలివలస, కొరువాడ, డి.అగ్రహారం, ఆర్లి, ఎరకన్నపాలెం, పిండ్రంగి గ్రామాల్లోని 150 ఎకరాల్లో వేశారు. మెట్ట భూములు ఈ పంటకు అనుకూలం కావడంతో దుంపలు దిగుబడి అధికంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలు పంటకు మేలు చేయనున్నట్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మరో నెల రోజుల్లో కర్ర పెండలం పంట చేతికి అందివస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జిగా రషీద్‌కుమార్

మాడుగుల రూరల్: మండలంలో నాలుగు ప్రాథమిక సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జిగా చోడవరం సబ్ డివిజనల్ కోఆపరేటివ్ కార్యాలయం సీనియర్ ఇన్‌స్పెక్టరు రషీద్‌కుమార్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు యలమంచిలి డిప్యూటీ రిజిస్ట్రారు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మాడుగుల, ఎం. కోడూరు, కింతలి, కె.జె.పురం సహకార సంఘాలకు వచ్చే డిసెంబరు 20వ తేదీ వరకు పర్సన్ ఇన్‌చార్జిగా కొనసాగుతారన్నారు.

ఏఎంఏఎల్ కళాశాలకు 'నాక్' గుర్తింపునకు కృషి


జార్జి క్లబ్‌లో సమావేశమైన ఏఎంఏఎల్ కళాశాల పూర్వ విద్యార్థులు

తుమ్మపాల: వేల మంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడేలా నాణ్యమైన విద్యనందించిన ఏఎంఏఎల్ కళాశాలకు నాక్ గుర్తింపు వచ్చేందుకు తమ వంతు కృషి చేస్తామని కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు బొడ్డేడ అప్పారావు, కృష్ణంరాజు, జగదీశ్వరరావు తెలిపారు. పట్టణంలోని జార్జిక్లబ్ ఆవరణలో నిర్వహించిన ఏఎంఏఎల్ కళాశాల పూర్వవిద్యార్థుల సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. జూలై నెల 18న నాక్ బృందం కళాశాలను పరిశీలించనున్న నేపథ్యంలో వివిధ ఉద్యోగ, వ్యాపారాలలో ఉన్నతంగా స్థిరపడిన పూర్వ విద్యార్థులు హాజరు కావాల్సిందిగా పిలుపునిచ్చారు. కళాశాలలో సోలార్ ప్లాంట్, డైనింగ్ హాల్ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. కళాశాలలో చదువుకుని రాజకీయాల్లో, ఉన్నత ఉద్యోగాల్లో, సినిమా రంగంలో రాణిస్తున్న వారిని ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు, పర్యవేక్షకురాలు పి.అనురాధ, వ్యాయామ సంచాలకులు డాక్టర్ కేఎస్ఎన్ నాయుడు, పూర్వ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

యలమంచిలి రూరల్ : అన్ని దానాల్లో కెల్లా రక్తదానం చాలా గొప్పదని యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని కొత్తపేటలో కాకినాడ శ్రీ అభయ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్థానిక వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రక్తదాతలతో మాట్లాడి, వారి సేవా భావాన్ని ప్రశంసించారు. ప్రశంసా పత్రాలను వారికి అందజేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న క్షతగాత్రులు, రోగులు, గర్భిణులు, బాలింతలకు రక్తం అవసరం అవుతుందన్నారు. సకాలంలో రక్తం ఎక్కించని పక్షంలో మృత్యువాత పడే అవకాశం ఉంటుందన్నారు. యువత సామాజిక స్పృహతో రక్తదానం చేయడానికి ముందుకురావాలన్నారు. బ్లడ్ సెంటర్ నిర్వాహకులు మొత్తం 50 మంది యువకుల నుంచి రక్తం సేకరించారు. రక్తదానం చేసిన వారందరికీ పండ్లు, కొబ్బరి బొండాలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక కూరగాయల వ్యాపారి గొలుసుపూడి శ్రీనివాస్ (బుజ్జి) ఆర్థిక సహాయం అందించారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వర్రావు, అత్రెపు సత్య గుప్తా, వైఎస్సార్‌సీపీ నాయకులు బొద్దపు ఎర్రయ్యదొర, టీడీపీ, జనసేన పార్టీల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

8న వైఎస్సార్ జయంతికి ఏర్పాట్లు

- వైఎస్సార్‌సీపీ నేత వీసం


వీసం రామకృష్ణ

నక్కపల్లి : ఈనెల 8వ తేదీన దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ పిలుపు నిచ్చారు. పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు నాలుగు మండలాల్లో మహానేత జయంతిని ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఆదివారం వై.వి. సుబ్బారెడ్డిని కలవడం జరిగిందన్నారు. ఇక నుంచి పార్టీ తరఫున కార్యక్రమాలు నిర్వహించాలని నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సుబ్బారెడ్డి సూచించారన్నారు. వైఎస్సార్ జయంతి ఈనెల 8వ తేదీన ప్రతి గ్రామంలోను, మండల కేంద్రంలోను ఘనంగా నిర్వహించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏ మేరకు నెరవేరుస్తుందో వేచి చూడాలన్నారు. అమలు సాధ్యం కాని హామీలు ఇవ్వడం వల్లే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఒకటోతేదీన పెంచిన పింఛన్ల పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం ఇంత వరకు తల్లికి వందనం కింద విద్యార్థుల చదువుల కొరకు ఇచ్చే ఆర్థిక సాయం, పెట్టుబడి కింద ఇచ్చే అన్నదాత సుఖీభవ సాయం ఎప్పుడు చెల్లిస్తారో చెప్పకపోవడం శోచనీయమన్నారు. ఆడబిడ్డ నిధి, 18 ఏళ్లు దాటిన మహిళలకు ప్రతి నెలా ఇచ్చే రూ.1500 సాయం, నిరుద్యోగులకు రూ.3వేలు భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పటి నుంచి ఇస్తారో ప్రకటించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులతో సూర్య నమస్కారాలు

నక్కపల్లి : మండలంలో చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఆదివారం సూర్యనమస్కారాలు, ఆదిత్య హృదయం పారాయణం చేయించారు. వేంపాడు ఆయుష్ ఆస్పత్రికిచెందిన యోగా ట్రైనర్ డీ రాంబాబు పాఠశాలలో విద్యార్థులకు కొన్ని రోజుల నుంచి యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం విద్యార్థులతో ఆదిత్య హృదయం పారాయణం చేయించారు. అనంతరం సూర్య నమస్కారాలు నేర్పించారు. ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు సూర్యనమస్కారాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రతి రోజు విద్యార్థులకు గంట పాటు యోగా నేర్పించడం జరుగుతుందన్నారు. మండలంలో ఉన్న అన్ని పాఠశాలల్లోను ఈ యోగా తరగతులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.


విద్యార్థులకు సూర్యనమస్కారాలు నేర్పిస్తున్న దృశ్యం

ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

- దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం


ఎంపీడీవో సుబ్బలక్ష్మి, ఏవో రమణ దంపతులను సత్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

దేవరాపల్లి: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసి, ప్రజలకు ఉత్తమ సేవలందించడంతోనే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని జెడ్పీటీసీ కర్రి సత్యం, వైస్ ఎంపీపీలు చింతల బుల్లిలక్ష్మి, ఉగ్రాకుల గంగాభవానీ తెలిపారు. ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, పరిపాలన అధికారి జి. వెంకటరమణ ఉద్యోగ విరమణ సన్మాన సభను స్థానిక నూతన ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుబ్బలక్ష్మి, పరిపాలన అధికారి రమణ దంపతులను ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. పంచాయతీ కార్యదర్శుల, ఉపాధి హామీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది జ్ఞాపికలను అందజేసి ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధతతో అందించిన వీరి సేవలను కొనియాడారు. మండల ప్రత్యేక అధికారి వి. రవీంద్రనాథ్, ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పలరాజు, పీఆర్ ఏఈ ఉమామహేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్, ఎంఈవోలు పడాల్‌దాస్, ఉషారాణి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం శుభ పరిణామం


ఎమ్మార్సీ భవనం వద్ద కొబ్బరి మొక్కలు నాటుతున్న ఎస్‌ఐ రామారావు, ఎంపీడీవో రాంబాబు, అధికారులు

నాతవరం: అశోకుడు ఆశయాలకు అనుగుణంగా కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటడం ప్రభుత్వ ఉద్యోగులకు మంచి దిక్సూచిగా భావించవచ్చునని ఎస్‌ఐ రామారావు తెలిపారు. ఆదివారం స్థానిక ఎమ్మార్సీ భవనం ప్రాంగణంలో ఖాళీ స్థలంలో ఎంఈవో తాడి అమృత్‌కుమార్ పదవీ విరమణ సందర్భంగా కొబ్బరి మొక్కలు నాటారు. కొనుగోలు చేసి తీసుకొచ్చిన 30 కొబ్బరి మొక్కలను ఎస్‌ఐ రామారావు, ఎంపీడీవో రాంబాబుతోపాటు మండల స్థాయి అధికారులతో నాటించారు. ఆయా మొక్కలను సంరక్షించే బాధ్యత స్థానికులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయా అధికారులు మాట్లాడుతూ అమృత్‌కుమార్ మాదిరిగా మిగతా శాఖల అధికారులు మొక్కలు నాటాలన్నారు. ఎంఈవో -2 కామిరెడ్డి వరహాలబాబు, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, పంచాయతీ విస్తరణాధికారి ఎస్.ఎస్.వి.మూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు పునరుద్ధరించాలని డిమాండ్


సీపీఎం మండల నాయకుడు చిరంజీవి

రోలుగుంట: నర్సీపట్నం ప్రజా రవాణా డిపో యాజమాన్యం కొత్తకోట మీదుగా వయా జె.నాయుడుపలెం, కశిరెడ్డిపాలెం మార్గంలో ఆర్టీసీ బస్సు సేవలు పునరుద్ధరించాలని సీపీఎం మండల నాయకుడు ఈరెళ్ల చిరంజీవి డిమాండ్ చేశారు. ఈ మార్గంలో విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు పడుతున్న ఇక్కట్ల గురించి ఆదివారం ఆయన మాట్లాడారు. గతంలో నర్సీపట్నం డిపో నుంచి ఆర్టీసీ సౌకర్యం ఉండేదని, ఆ తర్వాత ఆపేశారన్నారు. జె.నాయుడుపాలెం, కశిరెడ్డిపాలెం, గుర్రాలపాలెం, బల్జిపాలెం, జె.నాయడుపాలెం, జగ్గంపేట గ్రామాల నుంచి ఇంటర్, డిగ్రీ విద్యార్థులు నర్సీపట్నం, కొత్తకోట, చోడవరం జూనియర్ డిగ్రీ కళాశాలకు వెళ్లి చదువుకుంటున్నారని పేర్కొన్నారు. వీరితోపాటు ఆయా గ్రామాల్లో ప్రభుత్వ ఉద్యోగులు, బస్సు సౌకర్యం లేక సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోలేక ఆటోలను ఆశ్రయిస్తున్నారని వాపోయారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ఎక్కించుకోవడం, అధిక చార్జీలు వసూలు చేయడం, కొత్తకోట, రోలుగుంట వరకూ వెళ్లి వాహనాలు మారడం ఇబ్బందికరంగా మారిందన్నారు. దీనివల్ల సమయం వృథాతోపాటు వ్యయప్రయాసలకు గురవుతున్నారన్నారు. ఈ సమస్యను పరిశీలించి ఆర్టీసీ సేవలను పునరుద్ధరించాలని కోరారు.

ఆదమరిస్తే ప్రమాదమే..


కల్వర్టుకు రెండువైపులా రక్షణ గోడలు నిర్మించని ప్రాంతం

కె.కోటపాడు: డి.అగ్రహారం - కొరువాడ గ్రామాల మధ్య రైవాడ కెనాల్ మార్గంలో కల్వర్టుకు రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా మారింది. కెనాల్‌కు సమీపంలో మట్టిరోడ్డు అడుగుభాగంలో కొండగెడ్డ నీరు ప్రవహించేందుకు శ్లాబ్ కల్వర్ట్ పనులు చేశారు. దీనిపై భాగం గుండా సమీప గ్రామాల ప్రజలకు రాకపోకలు సాగిస్తుంటారు. శ్లాబ్ కల్వర్ట్‌కు ఒక వైపు నీరు ప్రవహించే కొండ గెడ్డ కాలువ పరిసరాల్లో మొక్కలు ఎదిగి ప్రమాదకరంగా ఉంది. రక్షణ గోడ లేక మొక్కలతో నిండిఉన్న కల్వర్ట్ వైపు ప్రాంతం లోతట్టుగా ఉంది. రాత్రిళ్లు ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించుకునే క్రమంలోకల్వర్ట్ వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జీవీఎంసీ అధికారులు మొక్కలను తొలగించడంతోపాటు రక్షణ గోడలు నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.